




రంజాన్ వేళలు

ప్రేరణనిస్తూ.. అన్నింటా రాణిస్తూ..

స్త్రీ లేకపోతే జననం లేదు..
స్త్రీ లేకపోతే గమనం లేదు..
స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు..
స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు..
ఆకాశంలో సగమై..
అన్నింటా తామై.. కీలకంగా వ్యవహరిస్తున్నారు మహిళామణులు. ప్రజాసేవ, క్రీడలు, కళలు, రాజకీయాలు, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తినిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న స్త్రీమూర్తులపై ప్రత్యేక కథనం.

ఆమే స్ఫూర్తి.. దీప్తి



రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ..



సాక్షి, భీమవరం: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా స్వచ్ఛంద రక్తదానంలో ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాముల్ని చేశారు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శిబిరాల నిర్వహణకు ఆదేశాలిచ్చారు. ఏ నెలలో ఏఏ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు రక్తదానం చేయాలో తెలుపుతూ షెడ్యూల్‌ను విడుదల చేశారు. గత డిసెంబరులో మొదలైన శిబిరాల నిర్వహణ విజయవంతంగా సాగుతోంది. ఇప్పటివరకూ దాదాపు 500 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఓ నెగెటివ్, బీ నెగెటివ్, ఏబీ నెగెటివ్ తదితర అరుదైన గ్రూప్స్ రక్తం అందుబాటులో ఉందని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ డా.ఎం.శివరామభద్రిరాజు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందిస్తున్నామన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతూ..



ఏలూరు రూరల్: ఆమెకు పేదరికం సవాల్ విసిరింది. ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే సంకల్పాన్ని ఇచ్చింది. పట్టుదలతో సాధన ఖ్యాతి గడించాలని ఉసిగొల్పింది. ఫలితంగా రాష్ట్ర, జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిపెట్టింది. ఏలూరుకు చెందని మొగలి దీపాన యోమీ పాఠశాల స్థాయి నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన చేస్తోంది. పేదరికపు అడ్డంకులను దాటి వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. ఐదేళ్ల క్రితం ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటింది. 2026లో జరిగే ఒలింపిక్స్ కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉత్తమ క్రీడాకారుల క్యాంపునకు ఎంపికైంది. ఔరంగాబాద్‌లో నెల రోజుల పాటు శిక్షణ తీసుకుని గెలుపే లక్ష్యంగా సాధన చేస్తోంది.

పరుగుల జ్యోతి



తణుకు అర్బన్: తణుకుకు చెందిన దండి **జ్యోతికశ్రీ ఒలింపిక్స్**లో దేశానికి ప్రాతినిధ్యం **వహించి కీర్తి** చాటింది. ఒలింపిక్స్ పోటీల్లో **పరుగు విభాగంలో** ఆమె పరుగెత్తిన రోజు దేశ వ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో ప్రముఖంగా నిలిచింది. తణుకుకు చెందిన అతి సామాన్యుడైన శ్రీనివాసరావు కుమార్తె జ్యోతిక శ్రీ చిన్ననాటి నుంచి తండ్రి సహకారంతో స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వేసిన అడుగులు ఆమెను ప్యారిస్ ఒలింపిక్స్‌కు చేర్చాయి. పరుగులో ఆటంకాలు, కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా అలుపెరుగని దీక్షతో ముందుకు సాగుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది జ్యోతికశ్రీ. శ్రమ, పట్టుదలతో ఏస్థాయికి అయినా చేరవచ్చనడానికి నిదర్శనంగా నిలుస్తోంది **ఈ తణుకు అమ్మాయి.**

గిరిజన మహిళ.. ఉపాధి భళా



బుట్టాయగూడెం: చిరుధాన్యాలను ఆదాయ వనరుగా మార్చుకుని స్వయం ఉపాధి పొందుతూ భళా అనిపిస్తున్నారు గిరిజన మహిళలు. కేఆర్ పురం ఐటీడీఏ సహకారంతో పౌష్టికాహార బిస్కెట్లు, పౌడర్లు తయారు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. ఓ కుగ్రామంలో ప్రారంభించిన వీరి వ్యాపారం ఇప్పుడు ఢిల్లీ వరకూ చేరింది. బుట్టాయగూడెం మండలం రాజానగరం, బండార్లగూడెంకు చెందిన గిరిజన మహిళలు 30 మంది 2016లో ఆహార ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేక శిక్షణ పొంది ఐటీడీఏ కార్యాలయం వద్దే 12 రకాల చిరుధాన్యాలతో మల్టీగ్రెయిన్ బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసుకుని ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నారు. అమెజాన్ వంటి సంస్థల ద్వారా ఉత్పత్తులను అమ్ముతున్నారు. ఇటీవల టాటా కంపెనీ ఏర్పాటు చేసిన సమావేశం కోసం వీరికి ఆర్డర్ వచ్చింది. ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ వీరి ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. వీరి ఉత్పత్తులకు ఆదరణ బాగుండటంతో ఆదాయం కూడా పెరిగింది.



క్రికెట్‌లో మెలకువలు నేర్పుతూ..



ఏలూరు రూరల్: ఒకప్పుడు గల్లీ క్రికెట్ ఆడిన యువతి.. నేడు ఆంధ్ర క్రికెట్ మహిళా జట్టుకు కోచ్ అయ్యారు. గ్రామీణ బాలికలను క్రికెటర్లుగా తీర్చిదిద్దుతూ క్రికెట్‌కు సేవలందిస్తున్నారు భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన సంపాద రమాదేవి. జిల్లా బాలికల క్రికెట్ జట్టు విజయాల్లో ప్రధాన భూమికి పోషిస్తున్నారు. ఆమె వద్ద శిక్షణ పొందిన బాలికలు జిల్లా, జోన్, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో పాటు రాష్ట్ర జట్టులో సైతం చోటు సంపాదించారు. 2017లో అండర్–19 ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్ర జట్టును విజయపథంలో నడపటంలో కీలకంగా వ్యవహరించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర మహిళల టీ–20 జట్టు కోచ్‌గా నియమితులమైన ఆమె ఏసీఏ లెవెల్–1 ఏగ్రేడ్, ఎన్‌సీఏ లెవెన్–1లో పాల్గొన్నారు.

బుర్రకథ.. శ్రీదేవి ఘనత



తాడేపల్లిగూడెం: ఏడేళ్ల వయసులోనే తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన కళారూపంలో ఆమె ఖ్యాతి గడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది ప్రదర్శనలతో ప్రశంసలు అందుకుంటున్నారు తాడేపల్లిగూడేనికి చెందిన బుర్రకథ కళాకారిణి యడవల్లి శ్రీదేవి. బుర్రకథ కళాకారుడు పద్మశ్రీ మిరియాల అప్పారావు కళావారసురాలిగా చిరుప్రాయంలోనే బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చారు. ఆరోహణ, అవరోహణ రాగాలను అవలీలగా ఆకళింపు చేసుకుని బుర్రకథను రక్తికట్టించడంలో ప్రేక్షకుల మన్ననలు పొందారు. 1992లో ఆకాశవాణిలో తొలిసారిగా బాలవిహార్ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు కథను చెప్పారు. అప్పటినుంచి ఆమె ప్రస్తానం అప్రతిహతంగా సాగుతోంది. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు. ఉగాది పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు వారి మహిళా సాధికారత అవార్డు, రాష్ట్రస్థాయిలో ఉత్తమ కళాకారిణి అవార్డులు అందుకున్నారు. 2023లో హుబ్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో తన ప్రదర్శనతో మెప్పించి పురస్కారం అందుకున్నారు. రాష్ట్రంతో పాటు మలేషియా, కువైట్, సింగపూర్, దుబాయ్ దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి భళా అనిపించుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక తరపున నారీరత్న అవార్డును అందుకోనున్నారు.

విద్యతో రాణించాలి



ప్రతి ఒక్క మహిళకూ వారి అమ్మే రోల్‌మోడల్. అలాగే నాకు మా అమ్మ లత ఇచ్చిన ప్రోత్సాహం మరువలేను. అమ్మ 8వ తరగతి వరకూ చదువుకున్నా నన్ను చదివించడంలో కీలక పాత్ర పోషించారు. కలెక్టర్ కావాలనే నా కోరికను నెరవేర్చుకోవడంలో ప్రధాన భూమిక పోషించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళా విద్య, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మార్చుకోవాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో మహిళలందరికీ శుభాకాంక్షలు.

– కె.వెట్రిసెల్వి, కలెక్టర్, ఏలూరు

స్త్రీ వ్యక్తి కాదు శక్తి



మహిళ కేవలం వ్యక్తి మాత్రమే కాదు. శక్తిగా అవతరిస్తూ నేడు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంటున్నారు. నన్ను కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి విధి నిర్వహణలో ప్రోత్సహిస్తుంటే.. మా అమ్మ కనకదుర్గ బాధ్యత మరువలేనిది. ఆమె ఇప్పటికీ నాకు అన్నివిధాలా తోడుగా ఉంటూ మనోధైర్యాన్ని నింపుతున్నారు. మా అమ్మే నా రోల్‌మోడల్. డాక్టర్‌గా సేవలందించాలనుకున్నా, అయితే రైతులకు సేవలు అందించడం ఆనందంగా ఉంది.

– వి.శ్రీలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, ఏలూరు

చాలెంజ్‌గా తీసుకోవాలి



మహిళలు సవాళ్లను చాలెంజ్‌గా తీసుకోవాలి. జిల్లాస్థాయి ఉద్యోగంలో చేరేంత వరకూ ఎంతో నేర్చుకున్నాను. ఇప్పటికీ నేర్చుకుంటున్నాను. తల్లిదండ్రుల సహకారం, భర్త ప్రోత్సాహంతో బాధ్యతలు నిర్వహిస్తున్నాను. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సహకారంతో జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖను ముందుకు తీసుకు వెళుతున్నాను. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

– పి.శారద, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, ఏలూరు

న్యూస్‌రీల్

విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పశుసంవర్ధకశాఖ ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఏడీఏ డాక్టర్ సుధీర్‌పై ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో సోదాలు జరిపి రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు సరిగా అందడం లేదని, మందులు ఉచితంగా ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆలీ మందులను పరిశీలించారు.

బయో ప్రింటింగ్‌పై విస్తృత పరిశోధనలు



నిట్ అధ్యాపకులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జీవ కణాలు అభివృద్ధే 3డీ బయో ప్రింటింగ్ అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నెక్స్ బిగ్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ సౌజన్యంతో నెక్స్‌జెన్ బైఫాబ్రికేషన్ ఇన్నోవేషన్స్ ఇన్ 3డీ బయో ప్రింటింగ్ అండ్ ఫంక్షనల్ బయో మెటీరియల్స్ అనే అంశంపై విద్యార్థులకు 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శంకర రెడ్డి మాట్లాడుతూ 3డీ బయో ప్రింటింగ్‌పై ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. బయో ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు సుందర్శన దీప, వినోత్ కుమార్‌రాజా మాట్లాడుతూ 3డీ బయో ప్రింటింగ్ ప్రాధాన్యత, వాటి రకాలు, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఆచార్యులు శారదా ప్రసన్న మాలిక, వందన కుమారి కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాసదన్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముందుగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హౌస్ కీపింగ్ పోస్టులకు సీల్డు టెండర్ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి యూనిట్‌లోని కోర్టు కాంప్లెక్స్‌ల హౌస్ కీపింగ్ సర్వీస్ (క్లీనింగ్) కోసం వార్షిక నిర్వహణ కాంట్రాక్టును రెండేళ్ల కాలానికి ఇవ్వడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని కోర్టు కాంప్లెక్స్‌లకు ఇద్దరు సూపర్‌వైజర్లు, 54 మంది హౌస్‌మెన్/హౌస్‌మెయిడ్‌లు అవసరమని, వీరిలో నలుగురికి ప్లంబింగ్, వడ్రంగి, విద్యుత్ పనుల్లో పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గలవారు తమ టెండర్ దరఖాస్తులను ఈనెల 17న సాయంత్రం 5 గంటలలోపు ఏలూరులోని జిల్లా కోర్ట్ కార్యాలయానికి అందేలా పంపాలని పేర్కొన్నారు.

మహిళా దినోత్సవానికి జెస్సీరాజ్



దెందులూరు: అమరావతిలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు అంతర్జాతీయ స్కేటర్, ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు గ్రహీత ఎం.జెస్సీరాజ్‌కు ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రముఖులు 9 మందిని ఎంపిక చేయగా వారిలో జెస్సీరాజ్ ఒకరు.

ముమ్మరంగా వేట

- మత్స్యకారులు బిజీబిజీ
- ఈ ఏడాది వరుస విపత్తులతో సతమతం
- కూటమి సహకారం కరువు
- వచ్చేనెల 14 నుంచి వేట నిషేధం



సముద్రంలో పడిన చేపలను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

నరసాపురం: నరసాపురం తీరం పొడవునా సముద్రంలో వేట ముమ్మరంగా సాగుతోంది. పలు జిల్లాలకు చెందిన మెకనైజ్డ్ బోట్లు వేట సాగిస్తున్నాయి. మచిలీపట్నం, కాకినాడ, నెల్లూరు, విశాఖ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 వరకు బోట్లు ఇక్కడ నడుస్తున్నాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, వేటకు అనుకూలంగా ఉండటం, చేపలు దొరికే సీజన్ కూడా కావడంతో మత్స్యకారులు బిజీగా ఉన్నారు. గతేడాది వేట కష్టనష్టాలతో సాగింది. వరుస విపత్తులు గంగపుత్రులను ఇబ్బంది పెట్టాయి. రాష్ట్రంలో గద్దెనెక్కిన కూటమి సర్కారు మత్స్యకారులను ఆదుకునేలా చర్యలు తీసుకోకపోవడం మరింత కుంగదీసింది.

భరోసా లేక.. వేసవిలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకాన్ని అమలు చేసింది. 2019–23 మధ్య ఐదేళ్లలో ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.7.87 కోట్ల సాయం అందించింది. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు అందిస్తామని ప్రకటించినా అమలు చేయలేదు. గతేడాది సాయానికి ఎగనామం పెట్టడం, జూన్ నుంచి నవంబర్ వరకు విపత్తులతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వచ్చే నెల నుంచి నిషేధం : చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధం అమలులోకి వస్తుంది. వేట నిషేధ గడువు దగ్గర పడటం, ప్రస్తుతం అనుకూల వాతావరణం ఉండటంతో సముద్రంలో వేట జోరుగా సాగుతోంది.

వారంలోనే ఒడ్డుకు..



సముద్రంలో ముమ్మరంగా వేట సాగుతోంది. సముద్రంలోకి వెళ్లిన బోటు వారం లోపునే సరుకుతో ఒడ్డుకు చేరుతోంది. బోటు యజమానులు పడిన సరుకును బట్టి మాకు డబ్బులు ఇస్తారు. దీంతో ఆనందంగా ఉంది. ఇప్పుడే నాలుగు డబ్బులు సంపాదించుకోవాలి. వచ్చేనెల నుంచి వేట నిషేధం అమలవుతోంది.

– తిరుమాని గంగరాజు, బోటు కార్మికుడు

తుపాన్లతో ఇబ్బంది



కూటమి సర్కార్ తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.20 వేలు పెంచి ఇస్తామన్నారు. ఈ ఏడాది ఒక్కపైసా కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టారు. రెండేళ్లకు కలిపి మత్స్యకారులకు రూ.40 వేలు ఇవ్వాలి. ఈ ఏడాది తుపాన్లు, అల్పపీడనాలతో వేట సవ్యంగా సాగలేదు. ఏడాదంతా అప్పులు చేసి ఈడ్చుకొచ్చాం.

– బర్రి శంకరం, మత్స్యకార నేత

రూ.200 కోట్ల మత్స్య సంపద ఎగుమతి

నరసాపురం తీరంలో గత జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకూ దాదాపు రూ.200 కోట్ల మత్స్యసంపద ఎగుమతులు జరిగినట్టు అంచనా. 2023–24లో రూ.300 కోట్ల వరకు ఎగుమతులు జరగ్గా.. ఈ ఏడాది రూ.100 కోట్ల మేర తగ్గాయి. వేట నిషేధం గడువు ఎత్తేసిన తర్వాత జూన్ నుంచి మత్స్యకారులు మరలా సముద్రంలో వేట ముమ్మరంగా సాగిస్తారు. గత జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో తుపానులు ఇబ్బంది పెట్టాయి. మరలా జనవరి నుంచి చేపలు పెద్ద సంఖ్యలో పడటంతో ఆశించిన ఆదాయం వస్తోందని మత్స్యకారులు అంటున్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): డీఎస్సీ–2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఈనెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఆర్‌వీ నాగరాణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా నేరుగా ఏలూరులోని బీసీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 86861 80018లో సంప్రదించాలని కోరారు.

జనరిక్ మందులపై రాయితీ



జనరిక్ మందుల షాపును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్ర (జనరిక్ మందులు) దుకాణాల ద్వారా నాణ్యమైన మందులు రాయితీపై లభిస్తాయని షాపు) కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదుట జనరిక్ మందుల షాపును కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ఆయన సందర్శించారు. జనరిక్ మందుల ద్వారా 80 శాతం ఖర్చులు ఆదా అవుతాయన్నారు. దేశవ్యాప్తంగా జనరిక్ షాపులు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత జనరిక్ మందుల షాపుల ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. డీఎంహెచ్‌ఓ బి.భానూనాయక్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి షేక్ అబిత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను వేగిరపర్చాలి : ఉపాధి హామీ కూలీలకు నూరు శాతం పని దినాలను కచ్చితంగా కల్పించాలని, ఎస్సీ, బీసీ సబ్సిడీ రుణాలపై సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆమె ఉపాధి హామీ, రుణాలు, పీ–4 సర్వేపై సమీక్షించారు. జిల్లాలో పీ–4 సర్వేను పక్కాగా నిర్వహించాలని, తాను తనిఖీలు చేపడతానని అన్నారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఎస్పీ నయీం అస్మితో విద్యార్థులు

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యమిస్తోందని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలను చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థినులకు పోలీసుశాఖ ఆయుధాలు, సాంకేతికత, కమ్యూనికేషన్, డ్రోన్స్, బీడీ టీమ్స్, బాడీవోర్న్ కెమెరాలు, పలు పరికరాలపై అవగాహన కల్పించామన్నారు. అలాగే డయల్ 100/112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబరు క్రైం ఫిర్యాదు కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్ల ప్రాధాన్యతను వివరించామన్నారు. శనివారం ముగింపు వేడుకలు నిర్వహించి, జిల్లావ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఏఎస్పీ వి.భీమారావు, పోలీసు అధికారులు ఎంవీవీ సత్యనారాయణ, వి.పుల్లారావు, డి.వెంకటేశ్వరరావు, డి.సురేష్, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ జాతర పోస్టర్ విడుదల



దుద్దుకూరులో జాతర పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఈ నెల 14 నుంచి 16 వరకూ 3 రోజులపాటు జరిగే గుబ్బల మంగమ్మ తల్లి జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. మండలంలోని దుద్దుకూరులో బాలరాజును గుబ్బల మంగమ్మతల్లి ఆలయకమిటీ సభ్యులు కలిసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతర మహోత్సవ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుబ్బల మంగమ్మ తల్లిని పూజించడం వల్ల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా పేరుండడంతో భక్తులు కూడా అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారన్నారు. గిరిజన పూజారి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో మంగమ్మ తల్లికి విశేషమైన పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కోర్సా గంగరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా కన్నపరాజు, గుజ్జు రామారావు పాల్గొన్నారు.

అన్నింటా.. అలుపే లేకుండా



కుటుంబానికి చేదోడుగా.. కుటుంబ పోషణకు అండగా.. ప్రతి పనిలోనూ మగువ అలుపే లేకుండా పరుగులు తీస్తోంది. తల్లిగా కుటుంబ భారాన్ని మోస్తూ.. చెల్లిగా ఆప్యాయతను పంచుతూ.. భార్యగా భర్తకు తోడూనీడగా ఉండడమే కాదు.. అన్నీ తానై నడిపిస్తోంది. కుటుంబ ఆదాయానికి చేయూతనిస్తూ.. అవసరమైతే కుటుంబ భారాన్ని తనపై వేసుకుని మోస్తూ మగవారితో సమానంగా చెమట చిందిస్తోంది. ఏలూరు నగరంలో శుక్రవారం కనిపించిన దృశ్యాలివి. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మహిళలకు సాక్షి సలాం. –సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు









బాలిక ఆచూకీ లభ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలిక ఆచూకీని పోలీసులు గుర్తించారు. టూటౌన్ సీఐ కాళీచరణ్ వివరాల ప్రకారం 36వ వార్డుకు చెందిన 11 ఏళ్ల బాలిక ఈ నెల 6న పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిందని, తల్లి పని కోసం బయటకు వెళ్లి వచ్చే సరికి బాలిక కనిపించలేదన్నారు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టగా శుక్రవారం బాలిక ఆచూకీ విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. బాలికను భీమవరం తీసుకొచ్చే ఏర్పాట్లు చేశామన్నారు.

ఖజానా ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



పశ్చిమగోదావరి జిల్లా ఖజానా శాఖ కార్యవర్గం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఖజానా ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులుగా యువీ పాండురంగారావు, కప్పల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఖజానా శాఖ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. ట్రెజరర్‌గా ఎల్.వెంకటేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా పి.హరిబాబు, ఎ.శ్రీనివాసరావు, యు.రాజేష్ కుమార్, ఎ.రమ కిరణ్మయి, జాయింట్ సెక్రటరీలుగా బి.నరసింహారావు, విద్యా సాగర్, డి.వరలక్ష్మిని ఎన్నుకున్నారు. ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా, ఏపీటీఎస్ఏ ప్రధాన కార్యదర్శి డి.రమణారెడ్డి సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: వృద్ధురాలిపై దాడి చేసి బంగారు నగలు దోపిడీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సాయిస్ఫూర్తి ఆసుపత్రి సమీపంలో ఒంటరిగా నివసిస్తున్న రిటైర్డ్ ఉర్దూ టీచర్ షేక్ ఫాతిమున్నీసా ఇంట్లోకి ఈ నెల 4న గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి, దాడి చేసి బంగారుగాజులు, మెడలో హారం దోచుకెళ్లారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. అరెస్టైన వారిలో గుత్తి శ్రీను అలియాస్ శ్రీనివాసరావుది బుట్టాయగూడెం మండలం కృష్ణాపురంలో ఉంటున్నాడని, మహమ్మద్ ఆలీషా అలియాస్ ఫయ్యం పట్టణంలోని పాతబస్టాండ్ ముస్లిం వీధిలో ఉంటున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులు వ్యసనాలకు అలవాటు పడి ఒంటరిగా ఉన్న వృద్ధులపై దాడికి పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు బంగారు గాజులు రికవరీ చేశామని, వీటి విలువ రూ. 2.5 లక్షలు ఉంటుందన్నారు. మరో నిందితుడి నుంచి హారం స్వాధీనం చేసుకోవాలన్నారు.

కోటి ఆశలతో ఉప్పు సాగు

- గతేడాది తుపాన్లు, వర్షాలతో ఉప్పు రైతు కుదేలు
- ఈ ఏడాది ప్రకృతిపై భారం వేసి సాగుకు సమాయత్తం
- ఏటా నష్టాలతో భారీగా తగ్గుతున్న సాగు విస్తీర్ణం



పెదమైనవానిలంకలో ఉప్పు సాగు

నరసాపురం : జిల్లాలోని నరసాపురం తీరంలో ఈ ఏడాది ఉప్పు సాగు ఉత్సాహంగా మొదలైంది. ఎండలు ముదరడంతో రైతులు సాగుకు ఉపక్రమించారు. గతేడాది వరస తుపాన్లు, వర్షాలు, అల్పపీడనాలతో ఉప్పు రైతులు కుదేలయ్యారు. దిగుబడి గణనీయంగా పడిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ప్రకృతిపై భారం వేసి ఉప్పు సాగు చేపట్టారు. జిల్లాలో 900 ఎకరాల్లో ఉప్పుసాగు చేపట్టారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో ఉప్పుసాగు మొదలైంది.

గిట్టుబాటు ధరలేక..

గతేడాది ఏప్రిల్‌లో పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర కాస్త పెరగడంతో రైతులు ఒకింత ఆనంద పడ్డారు. అయితే తుపాన్లు, వర్షాలు కారణంగా అసలు పంట దిగుబడి రావడమే తగ్గిపోవడంతో ఉపయోగంలేకుండా పోయింది. ప్రస్తుతం తీరంలో పండించే ఉప్పు బస్తా (50 కిలోలు) రైతుల వద్ద దళారులు రూ.200కు కొనుగోలు చేస్తున్నారు. గత మూడేళ్ల నుంచి ఇదే ధర పలుకుతోంది. కనీసం బస్తా రూ.300 ఉంటేనే గిట్టుబాటని చెబుతున్నారు. నరసాపురం తీరం నుంచి ఆంధ్రా, తెలంగాణాలోని పలు ప్రాంతాలకు ఉప్పు ఎగుమతి అవుతుంది. ఉభయగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతుంది.

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

2022, 2023 సంవత్సరాల్లో తీరంలో 1500 ఎకరాల్లో ఉప్పుసాగు జరిగింది. గత ఏడాది కూడా వెయ్యి ఎకరాల వరకూ జరిగింది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 900 ఎకరాలకు పడిపోయింది. ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగిపోతూ వస్తోంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడితో రైతులు సాగుకు మొగ్గుచూపడంలేదు. క్రమంగా తీరంలో ఉప్పుమడులు చేపలు, రొయ్యల చెరువులుగా మారుతున్నాయి. 15 ఏళ్ల క్రితం తీరంలో దాదాపు 15 గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో ఉప్పుసాగు జరిగేది.



నరసాపురంలో ఉప్పు సాగు



గట్టు మీదే గుట్టలుగా నిల్వ (ఫైల్)

కష్టంతో కూడుకున్న పని

ఉప్పు సాగు కష్టంతో కూడుకున్నది. మడి కడితే దాదాపు 6 నెలల వరకూ ఉప్పు దిగుబడి వస్తూనే ఉంటుంది. వేసవి ప్రారంభంలో ఏటా మార్చి నెలలో ఉప్పుసాగు ప్రారంభం అవుతుంది. చిన్న చిన్న మడులను ఏర్పాటు చేసి ఉప్పు సాగు చేస్తారు. ఒక్కో ఎకరానికి 60 నుంచి 70 మడులను కడతారు. మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి సముద్రంలోని ఉప్పు నీటిని ఆ మడుల్లో నింపుతారు. సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు 6 నుంచి 10 మంది శ్రమిస్తేనే కానీ ఉప్పు తయారీ కాదు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోలు వరకూ ఉత్పత్తి వస్తుందని రైతులు చెపుతున్నారు.

గిడ్డంగుల సదుపాయాలు లేక

పండించిన ఉప్పును భద్రపరచుకోవడానికి గిడ్డంగులు లాంటి సదుపాయాలు లేవు. గిడ్డంగులు ఉంటే వర్షాలు వచ్చినప్పుడు పండించిన ఉప్పును వాటిలో భద్రపరుచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. పండించిన ఉప్పును రైతులు ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. ఆకస్మాత్తుగా వర్షాలు పడినా, తుపాన్లు వంటి విపత్తులు వచ్చి పడినా ఉప్పుకుప్పలు ధ్వంసమైపోతాయి. రైతు కష్టం మొత్తం కరిగిపోతుంది.

అధికార పంటగా గుర్తింపు లేదు

అలాగే ఉప్పుసాగుకు అధికార పంటగా ఇప్పటివరకూ గుర్తింపులేదు. ప్రకృతి విపత్తుల కారణంగా ఉప్పు పంట ధ్వంసమైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాదు. ఇన్సూరెన్స్ లాంటి సదుపాయాలు ఉండవు. ఉప్పుసాగును అధికార పంటగా గుర్తించాలని, మిగిలిన పంటలకు మాదిరిగా అందించే సదుపాయాలు కలుగజేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉన్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.

తీరంలో ఉప్పు సాగు

తీర ప్రాంతం: 19 కిలోమీటర్లు

గతంలో ఉప్పు సాగు చేసే గ్రామాలు: 15

ప్రస్తుతం ఉప్పు సాగు గ్రామాలు: 8

ఏటా ఉత్పత్తయ్యే ఉప్పు (ప్రస్తుతం): 2 వేల టన్నులు

ప్రస్తుతం ఉప్పుసాగు విస్తీర్ణం: 900 ఎకరాలు

ఉప్పు సాగుపై ఆధారపడిన రైతులు: 500 మంది

పరోక్షంగా 2 వేల మందికి జీవనాధారం

గతేడాది అంతా నష్టమే



మార్చి నెలలోనే ఉప్పుసాగు సీజన్ మొదలవుతుంది. ఈ ఏడాది ఎండలు ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యాయి. గతేడాది జూన్ నుంచి డిసెంబర్ వరకూ వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో మడుల్లోకి నీరు చేరింది. అప్పటికే పండించిన ఉప్పును అయిన కాడికి అమ్ముకున్నాము. అన్నీ నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది వాతావరణం కలసి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నాము.

– మైలా సూర్య చంద్రరావు, ఉప్పురైతు పీఎం లంక, నరసాపురం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



50 కేజీల బస్తా రూ.200 పలుకుతోంది. దళారుల మా వద్ద కొన్న ధరకు బయట మార్కెట్‌లో ఉప్పు ధరకు సంబంధం లేదు. పెట్టుబడులు బాగా పెరిగాయి. గిట్టుబాటు ధర లేకపోతే సాగు కష్టం. అందుకే ఈ ఏడాది చాలా గ్రామాల్లో సాగు మానేశారు. గిడ్డంగులు లేకపోవడం వల్ల వర్షాలు పడితే దళారులు అడిగినంతకు అమ్ముకోవాలి. ఉప్పు సాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పొన్నమండ రాజాపండు, ఉప్పురైతు, తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడేపల్లిగూడెం రూరల్: కడుపు నొప్పి తాళలేక గడ్డి మందు తాగి, చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిందని.. కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన బుర్ల కృష్ణవేణి (54) పైల్స్ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతుంది. దీంతో నొప్పి తాళలేక ఈ నెల 3న సాయంత్రం గడ్డి మందు తాగింది. అనంతరం ఆమెను ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆమె భర్త బుర్ల వీర్రాజు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమవరం మండలంలో మరొకరు మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం నాగిడిపాలెంకు చెందిన తిరుమాని రాముడు(52) ఈ నెల 2న నడుచుకుంటూ వెళ్తుండగా నాగిడిపాలెం బ్రిడ్జిపైకి వచ్చేసరికి జాతీయ రహదారి వద్ద వ్యాన్ ఢీకొట్టింది. కుటుంబసభ్యులు, స్థానికులు భీమవరంలో ఆస్పత్రికి.. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని ముప్పినవారిగూడెం సమీపంలో నిర్మించిన ఆర్ అండ్ ఆర్ నిర్వాసిత కాలనీ తాట్కూరుగమ్ములో ఏర్పాటు చేసిన 16 కేవీ కెపాసిటీ ఉన్న 2 విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్ వైర్‌లు చోరీకి గురైనట్లు ఏఈ శ్రీనివాస వర్మ తెలిపారు. ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ముప్పినవారిగూడెం సమీపంలో తాట్కూరుగమ్ము నిర్వాసిత కాలనీని నిర్మించారన్నారు. విద్యుత్ సదుపాయం కోసం 16 కేవీ కెపాసిటీ ఉన్న 2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆ కాలనీకి నిర్వాసితులకు ఇంకా రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయన్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నవారు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్లు సమాచారం అందించారని చెప్పారు. అక్కడికి వెళ్లి పరిశీలించామని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ చెప్పారు.

క్లుప్తంగా

నీలాద్రిపురంలో పాడి పశువులకు టీకాలు



నీలాద్రిపురం గ్రామంలో దూడలకు టీకాలు వేస్తున్న ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 124 ఆవులు, 277 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతికి నారీరత్న అవార్డు



వి.ఆశాజ్యోతి, సామాజికవేత్త

తణుకు అర్బన్: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త వి.ఆశాజ్యోతికి నారీరత్న, ఉమన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు–2025 అవార్డులు దక్కాయి. నిరంతరాయంగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రభంజనం సృష్టిస్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు ఆశాజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతిని పలువురు అభినందించారు.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చు

తణుకు అర్బన్: పీఎం ఇంటర్న్ షిప్ పథకం 2025కు దరఖాస్తులు చేసుకోవాలని తణుకు సహాయక కార్మికాధికారి ఎం.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ లేబరు ఆఫీసర్ బి.లక్ష్మణకుమార్ తెలిపారు. భారతదేశంలోని 500 కంపెనీలు, పరిశ్రమల్లో ఇంటర్న్ షిప్ కోసం ఒక సంవత్సరం పాటు వ్యవధి ఉంటుందని, భారత ప్రభుత్వం ద్వారా నెలవారీ సహాయం రూ. 4500, పరిశ్రమ రూ. 500, ఒకేసారి ఇచ్చే గ్రాంట్ రూ. 6వేలు ఉంటుందని చెప్పారు. 21 నుంచి 24 సంవత్సరాల్లోపు వయస్సున్న వారు అర్హులని (ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సడలింపు), 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమో, పాలిటెక్నిక్, బీఏ, బీకామ్, బీసీఏ, గ్రాడ్యుయేషన్ కలిగి ఉండాలని, అలాగే రూ. 8లక్షలలోపు కుటుంబ వార్షిక ఆదాయం కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఇంటర్న్‌కు బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసే విధానంలో భాగంగా పీఎం ఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవీ.ఇన్. వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

మహిళల సాధికారతతో సమాజాభివృద్ధి



పెంటపాడులో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెంటపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెంటపాడు డీఆర్ గోయెంకా డిగ్రీ కళాశాలలో పలువురు మహిళా ఉపాధ్యాయులతో పాటు, పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ మౌనికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, విజయబాబు, కుసుమకుమారి, జాన్‌బాబు, ఇందిర, సుంకర గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అయితంపూడిలో చోరీ

ఇరగవరం: మండలంలోని అయితంపూడి గ్రామంలో శుక్రవారం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ జాన సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయితంపూడి గ్రామానికి చెందిన చెన్నం రామకృష్ణ అనే వ్యక్తి ఇటివల అదే గ్రామంలో నూతన గృహం నిర్మించుకున్నాడు దీంతో పాత ఇంటిలో సామన్లు ఉంచి తాళం వేసి కొత్త గృహంలో కాపురం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అయిదు గంటలకు పాత గృహం వద్దకు వచ్చి చూసే సరికి ఇంటికి ఉన్న తాళం పగలగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

వేణుగోపాలుడి కల్యాణం చూతము రారండి

తణుకు అర్బన్: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది చలువ పందిర్లు వేశారు.

ముంచెత్తగా..

- చెత్త తరలింపులో నిర్లక్ష్యం
- మూలకు చేరిన క్లాప్ వాహనాలు
- పందుల స్వైరవిహారం
- పారిశుద్ధ్యం మెరుగు చర్యలో మున్సిపల్ అధికారులు విఫలం

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్తరహిత పట్టణాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణంలో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సి పరిస్థితులు నెలకొన్నాయి.



తణుకు బొమ్మల వీధిలో రోడ్డుపై తిప్పవేసిన చెత్త



ప్రభుత్వ పాఠశాల ముందు కొండలా ఎదుగుతున్న చెత్తతో మినీ డంపింగ్ యార్డుగా ఖాళీస్థలం



బీసీ హాస్టల్ ముందు చెత్త వేస్తే వెయ్యి జరిమానా అని ఏర్పాటుచేసిన బోర్డు వద్ద చెత్త డంపింగ్

తణుకు అర్బన్: ఇంటింటి చెత్త సేకరించి కంపోస్టుకు పంపించే ప్రక్రియ తణుకు మునిసిపాలిటీ పరిధిలో చెత్తగా సాగుతోంది. మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లోను ఇంటి చెత్త రోడ్డుపైకి రావాల్సిందే.. అక్కడ కొన్నిగంటలు తిష్టవేయాల్సిందే.. అన్నట్లుగా పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతోందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. పేరుకుపోతున్న చెత్తలతో నిత్యం ఆ ప్రాంతాలు దుర్వాసన, దుర్గంధంతో కంపు కొడుతున్నాయని స్థానికులు వాపోతున్నా రు. గతంలోలేని సమస్య ఇప్పుడు ఎందుకిలా వస్తుందంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నంబరు 13 మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీస్థలాల్లో స్థానికంగా ఉన్న చెత్తనంతటినీ తీసుకువచ్చి పారవేయడం, మంటలు పెట్టడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఈ ప్రాంతంలో పందులు తిష్టవేసి మురికికూపంగా మారుస్తున్నాయని, శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. బొమ్మల వీధి, స్త్రీసమాజం రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం, బీసీ హాస్టల్ ప్రాంతాల్లో చెత్త కుప్పలు రోడ్లపైనే ఉంటున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా పట్టణంలోని కొన్ని ఖాళీస్థలాలను శానిటరీ అధికారులు స్వయంగా మినీ కంపోస్టులు గా ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా శానిటరీ మేస్త్రిల పర్యవేక్షణ లోపించడం, పారిశుద్ధ్య కార్మికుల మస్తరుల్లో కుస్తీలు పట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శలు వస్తున్నాయి.

నిలిచిపోయిన క్లాప్ వాహన సేవలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఇంటి నుంచి వచ్చే చెత్తను నేరుగా కంపోస్టు యార్డుకు తరలించే ఉద్దేశ్యంతో సచివాలయానికి ఒకటి చొప్పున క్లాప్ సేవల పేరుతో నాలుగు చక్రాల వ్యాన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యాన్‌లు మైకులో హెచ్చరికలుచేస్తూ ఇంటి గుమ్మాల్లోకి రావడం తడి, పొడి చెత్తను విడివిగా తీసుకుని నేరుగా కంపోస్టు యార్డులోకి వెళ్లేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పురిటినొప్పులతో నడిచిన ఈ వాహనాలు డ్రైవర్లకు జీతాలు, వాహనాలకు ఆయిల్ కొట్టించలేని స్థితిలో మూలకు చేరాయి. దీంతో ఇంటి చెత్త రోడ్డుపైనే పారవేయాలి.. గంటో రెండు గంటలో రోడ్డుపై ఉన్న తర్వాత ట్రాక్టర్లు ఆ చెత్తను తీసుకువెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

చెత్త కుండీలు ఏర్పాటు..

నేటి ఆధునిక యుగంలో సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణలో దశాబ్దాల కాలం క్రితం వాడిన పద్ధతిని తణుకులో పాటిస్తున్న దుస్థితి నెలకొంది. గతంలో సిమెంట్ చెత్త కుండీలు రోడ్డు మార్జిన్‌లలో ఏర్పాటు చేయగా, చెత్తను తీసుకువెళ్లే ఎడ్ల బండ్లు చెత్త కుండీ కనిపించగానే ఆగిపోయే పరిస్థితులు ఉండేవి. అయితే నేడు ఎడ్ల బండ్లు లేనప్పటికీ అప్పటి చెత్త కుండీలు మాత్రం మళ్లీ తణుకులోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ప్రత్యక్షమవుతుండడం తణుకు అభివృద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ప్రజానీకం చెవులు కొరుక్కుంటున్నారు.

బీవీఆర్‌లో 30న ఉగాది నృత్యోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో సాంస్కృతికశాఖ, భారత ప్రభుత్వం న్యూఢిల్లీ, ఏపీ సృజనాత్మకత, సంస్కృతి వార్ల ఆర్థిక సహకారంతో మార్చి 30 ఆదివారం, 31వ సోమవారం తేదీల్లో డీఎస్ చెరువు సమీపంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో 32వ జాతీయ స్థాయి ఉగాది నృత్యోత్సవాలు (నృత్య పోటీలు) జరుగుతాయని బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, నిర్వహణ కార్యదర్శి పీటీ వెంకన్నలు వెల్లడించారు. జాతీయస్థాయి కూచిపూడి, భరత నాట్యం, జానపదం, బృంద నృత్యాలు, సోలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని, నిబంధనలు మేరకు పోటీలు ఉంటాయని తెలిపారు.

నేడు తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సాహితీ సమాఖ్య 656వ కార్యక్రమం ఈ నెల 8వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు మండ బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాస్‌రావులు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం, మహిళలకు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సాహితీ సభ్యులు, కళాకారులు, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



తణుకు స్టేట్ బ్యాంకు ఆవరణలో నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు

తణుకు అర్బన్: బ్యాంకు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తణుకు స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో నిరసన తెలిపారు. బ్యాంకుల్లో అన్ని క్యాడర్‌లకు సంబంధించిన ఉద్యోగులను నియమించాలని, టెంపరరీ స్టాఫ్‌ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వారానికి ఐదు పని దినాల విధానాన్ని అమలు చేయాలని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీస్ ఆదేశాలు బ్యాంకు సిబ్బందికి వ్యతిరేకంగా ఉన్నాయని వాటిని తొలగించాలని, బ్యాంకు సిబ్బంది పట్ల జరిగే దాడులను అరికట్టాలని, ఉద్యోగుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని, ఐబీఏ వద్ద అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాట్యుటీ విధానాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని, బ్యాంకు సిబ్బందికి ఇచ్చే రాయితీ రుణాలపై ట్యాక్స్ విధానాన్ని బ్యాంకు యాజమాన్యం భరించాలని, ఐడిబిఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వ షేర్ 51% కనీసం కలిగి ఉండాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు రవితేజ, గోవింద్, శివ, చరణ్, కృష్ణమోహన్, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలుని కల్యాణోత్సవాలు





బల్లిపాడులో విశేష అలంకరణలో మదనగోపాలస్వామి, లక్షతులసి పూజలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన బల్లిపాడు గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీస్వామి, అమ్మవార్లకు నిత్యార్చనలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపారు. అనంతరం స్వామివారికి లక్ష తులసి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి సత్యనారాయణాచార్యలు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో పలువురు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ లక్ష తులసి పూజ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ఎల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్దాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట నాగ వెంకట శివగణేష్, ప్రగడ నాగ వెంకట మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, కొల్లి సంతోషం, కోటిచుక్కల పోతురాజు పాల్గొన్నారు.

12న ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పాల్ తదితరులు

తణుకు అర్బన్: విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన భీమవరం కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ఫీజు పోరు ధర్నాకు తణుకు పట్టణం నుంచి వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తణుకు నియోజవర్గ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గోపే ఎడ్వర్డ్ పాల్ పిలుపునిచ్చారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది మాసాలు అవుతున్నప్పటికీ ఇంతవరకు విద్యార్థులకు చెల్లిస్తానన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల విద్యకు ఆటంకంగా మారుతుందని, ఇది తల్లిదండ్రులకు పెనుభారంగా మారుతుందని ధ్వజమెత్తారు. మోసపూరిత హామీలతో కాలయాపన చేస్తున్నారే తప్ప విద్యార్థులకు ఇచ్చిన హామీలపై మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న సుమారు రూ. 4వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐయస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, ఏపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వంశీ, ఎన్ వెంకట్ , పట్టణ అధ్యక్షుడు అమృత్, కే సోమాంజన్ , సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు



తణుకు ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ విజయనిర్మల

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో వ్యాధికారక స్వేచ్ఛ సూక్ష్మజీవులపై ఔషధ ఆవిష్కరణ, రోగ నిర్ధారణ సాధనాలపై అవగాహన అనే అంశంపై రెండురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాజమండ్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నన్నయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారుచేయడం వలన దేశ విదేశాల్లో ప్రజలు వైరస్ బారినుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. ఆధునిక కాలంలో నానో మెడిసిన్ అభివృద్ధి చెందుతుందని రోగ నిర్ధారణ, పరిశోధన వంటి రంగాల్లో క్యాన్సర్ వ్యాధుల్లో ఇతర శరీర అవయవాలకు హాని కలుగకుండా నానో మెడిసిన్ పనిచేస్తుందన్నారు. తిరుపతి డిపార్ట్‌మెంట్ ఆఫ్ వైరాలజీ ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ జి.నరసింహ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా శరీర నిర్ధారణ పరీక్షల్లో ఎక్కడ ఏ వ్యాధి ఉందో తెలుసుకోవచ్చని, ట్యూమర్‌లాంటి వాటిని కూడా గుర్తించవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్‌లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదేవిధంగా పెంటపాడులో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 2071మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 2,035 మంది పరీక్షలకు హాజరయ్యారు. 36మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అభ్యుదయ మహిళా పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో అభ్యుదయ మహిళా పాడి రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విర్‌బాక్ కంపెనీ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి టి.వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రంగంలో పాల దిగుబడులు పెంపొందించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం పాడి పెంపకంలో క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విర్‌బాక్ సంస్థ ప్రతినిధులు రంగాచారి, రమేష్, జేవీవోలు హేమలత, గౌతమి, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



శశిలో వార్షిక క్రీడా ఉత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడలు దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని డీఎస్పీ ఏ.విశ్వనాథ్ అన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షిక క్రీడా ఉత్సవం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి, సమూహ ప్రేరణ వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, డీన్ అండ్ స్పోర్ట్స్ కోర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పీడీ లెఫ్టినెంట్ శేఖర్‌లు క్రీడాకారులను ప్రోత్సహించారు. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల నీటి కష్టాలు!

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కుళాయి రాక ఇబ్బందులు పడుతున్న స్థానికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కుళాయిల నుంచి ఉదయం, సాయంత్రం గత మూడు రోజులుగా తాగునీరు రావడం లేదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రతిరోజు ఉదయం గంట, సాయంత్రం గంట కుళాయిలు వస్తాయి. విద్యుత్ ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు అరగంట, సాయంత్రం 5.30 నుంచి 6.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం కారణంగా పట్టణంలో అందరికి తాగునీరు పూర్తి స్థాయి సరఫరా కావడం లేదు. ఇంటర్ పరీక్షలు, ఇతర సాంకేతిక కారణాలతో మూడు రోజులుగా విద్యుత్ సరఫరాను కుళాయిలు వచ్చే సమయంలో నిలిపివేయడం లేదు. దీంతో మోటార్లు ఉన్న వారు మినహా మిగిలిన సామాన్య ప్రజలందరూ, పబ్లిక్ కుళాయిలను ఆశ్రయించి నీరు రాక అవస్థలు పడుతున్నారు. పైపులు నుంచి నీరు రాని చోట్ల ప్రజలు పైపులు వద్ద బిందెలు, బక్కెట్లతో ఎప్పుడు కుళాయి నుంచి నీరు వస్తుందోనని ఎదురు చూస్తు వేచిచూడటం గమనార్హం. వేసవి వస్తే మరింత ఇబ్బందులు తప్పవని అంటున్నారు. స్థానిక ప్రతినిధులు సైతం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



భవిత సెంటర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుబ్బారావు పేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డైమండ్స్, పేరిచర్ల ఫౌండేషన్ తరుపున మునిసిపల్ హెచ్ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లల సంరక్షణ చేస్తున్న బి.నాగలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కేవీ బాబు, చిక్కాల అంబిక, డాక్టర్ కేవీ కమల, కె.విక్టర్ బాబు, కె.లక్ష్మి, చెన్నారెడ్డి సతీష్, ఎం.సుభద్ర, సుజాత, ప్రియాంక, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3ఎఫ్ కర్మాగారంలో కొనసాగుతున్న ఐటీ సోదాలు



ఐటీ సోదాలు జరుగుతున్న సందర్భంగా నిర్మానుష్యంగా ఉన్న ప్రత్తిపాడు 3ఎఫ్ కర్మాగారం

పెంటపాడు: పెంటపాడు మండలం ప్రత్తిపాడులో 3ఎఫ్ కర్మాగారంలో శుక్రవారం కూడా ఐటీ సోదాలు నిర్వహించారు. ఏలూరు నుంచి వచ్చిన ఐటీ అధికారుల బృందం కర్మాగారానికి సంబంధించి పలు దస్త్రాలు పరిశీలించినట్లు సమాచారం. ప్రస్తుతం సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.